## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గుడివాడ టౌన్:** విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు

**గుడ్లవల్లేరులో..**

**గుడ్లవల్లేరు:** గుడ్లవల్లేరు మండలంలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏఈ సుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు.

### మొవ్వ కోర్టు పరిశీలన

**మొవ్వ:** సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు న్యాయస్థానాల పరిశీలనలో భాగంగా కృష్ణా జిల్లా మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని న్యాయస్థానాన్ని గురువారం రాత్రి కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్ శ్రీహరిబాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్ పరిశీలించారు. ఇటీవల నెల్లురులో జరిగిన సంఘటనలను దృష్ట్యా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ పరిశీలన చేసినట్లు స్థానిక అధికారులు తెలిపారు. కోర్టు సిబ్బంది సహకారంతో కోర్టు ప్రాంతాన్ని, రికార్డులు భద్రపరిచే ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

### ఎరువుల విక్రయాలను పెంచాలి

**మండవల్లి:** ఆర్బీకేల్లో ఎరువుల విక్రయాలను పెంచాలని, ఈ క్రాప్ ఈకేవైసీ పూర్తి చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి పేర్కొన్నారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు క్రాప్ కటింగ్ ప్రయోగాలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా, ఏఎస్ఓ సుజాత పాల్గొన్నారు.

### బాలమ్మ తల్లి సంబరం

**జమిదింటకుర్రు(పెదపారుపూడి):** మండలంలోని జమిదింటకుర్రు గ్రామంలో శ్రీ బాలమ్మ తల్లి వార్షిక సంబరం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మ వారి విగ్రహం వద్ద మహిళలు కొబ్బరి కాయలు పెట్టి పొంగళ్లు సమర్పించారు. గ్రామ సర్పంచ్ పుణుకొల్లు శివరామప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వానపాముల, కొర్నిపాడు, తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

### ఫ్లై ఓవర్ నిర్మాణానికి సహకరించండి

**గుడివాడ టౌన్:** పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న నిర్మాణ పనులకు సహకరించాలని రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబీ) డీఈ శ్రీనివాస్ కోరారు. స్థానిక పామర్రు రోడ్‌లో ట్రాఫిక్ ఎస్సై పీవీ ప్రసాద్‌తో కలిసి నిర్మాణం పరిసర ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ రోడ్‌లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుందన్నారు. కనుక పరిసర ప్రాంత వ్యాపారులు, ఇతర షాపు నిర్వాహకుల సహకారం ఎంతో అవసరం అన్నారు. ట్రాఫిక్ మళ్లింపునకు అవసరమైన చర్యలపై ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్‌తో చర్చించారు.

### ఘనంగా ఫ్రెషర్స్ డే

**గుడివాడ టౌన్:** స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు పరస్పర సహకారంతో చదువులో ముందుండాలన్నారు. ప్రిన్సిపాల్ పీజేఎస్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ఎంబీఏ అధిపతి సి.లక్ష్మీనాథ్ పాల్గొన్నారు.

### నిర్మాణ పనుల పరిశీలన

**మోపర్రు(పెదపారుపూడి)** మండలంలోని మోపర్రులో నిర్మిస్తున్న ఆర్బీకే, హెల్త్ క్లినిక్ కేంద్రాల నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఏఈ రామ్మోహనరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వం సుమారు రూ.21.20 లక్షలతో ఆర్బీకే కేంద్రాన్ని, రూ.17 లక్షలతో హెల్త్ క్లినిక్ కేంద్రాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జాపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

### వలంటీర్లదే కీలకపాత్ర

**గుడివాడరూరల్:** ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా నిర్వహించడంలో వలంటీర్లది కీలక పాత్ర అని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను ఎంపీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు మేలు చేశారన్నారు. వలంటీర్లను నియమించిన తర్వాత నేరుగా ప్రభుత్వ పథకాలను ఇళ్ల వద్దకే తీసుకువచ్చి ప్రజలకు అందచేసి మేలు చేస్తున్నారన్నారు.

### అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

**గుడివాడ టౌన్(నందివాడ):** నందివాడ మండలంలో అగ్నిమాపక శాఖ నిర్వహిస్తున్న అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు శుక్రవారం కూడా కొనసాగాయి. మండలంలోని రుద్రపాక, పోలుకొండ, పుట్టగుంట సచివాలయాల పరిధిలో డెమో నిర్వహించారు.

# బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట

**బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి**



సభలో మాట్లాడుతున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

**గుడివాడరూరల్:** బడుగు, బలహీన వర్గాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డ్‌లో గుడివాడ మార్కెట్‌యార్డ్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వ హయాంలో లేని విధంగా నామినేటెడ్ పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చి వారికి సముచిత స్థానం కల్పించారన్నారు. గుడివాడ మార్కెట్‌యార్డ్ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఎస్సీలకు చైర్మన్ పదవిని కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో పాటు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానికి దక్కుతుందన్నారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో వెనుకబడిన వర్గాలకు అత్యధిక పదవులు ఇచ్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుగడించారన్నారు. చంద్రబాబు, లోకేష్ సొల్లుకబుర్లు చెప్పుకుంటూ రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారని, వారి ఆటలు సాగబోవన్నారు. వచ్చే ఎన్నికల్లో 175కు 175సీట్లు వైఎస్సార్ సీపీ గెలిచి టీడీపీని అడ్రస్ లేకుండా చేయడం ఖాయమన్నారు. ఆడవాళ్లను అడ్డుపెట్టుకుని వెదవ రాజకీయాలు చేయాలని బాబు, కొడుకులు చూస్తున్నారన్నారు. గుడివాడలో ఇదే పద్ధతి ఇప్పుడు మొదలైందని, భార్య వెనుకబడిన వర్గానికి చెందినదని చెప్పుకుని ఓట్లు దండుకోవడానికి చూస్తున్నారని, వారి సొల్లుకబుర్లు ప్రజలు నమ్మబోరన్నారు. వచ్చే ఎన్నికల్లో గుడివాడలో తాను, బందరు పార్లమెంట్‌లో బాలశౌరి గెలవడం ఖాయమని పేర్కొన్నారు. విదేశాల నుంచి వచ్చిన వారు ఎన్నికల ఫలితాల రోజునే గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని వచ్చిన చోటకే తిరిగి వెళ్లడం ఖాయమని కొడాలి నాని విమర్శించారు. పామర్రు, తిరువూరు ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, కొక్కిలిగడ్డ రక్షణనిధి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్సీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి ఉన్నతమైన పదవులను కట్టబెట్టారన్నారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ మట్టా నాగమణివిక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని ఇచ్చిన ఎమ్మెల్యే కొడాలి నానికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యేగా కొడాలి నానిని గెలిపించేందుకు ప్రాణాలైనా ఇస్తామన్నారు. అనంతరం చైర్మన్ మట్టా నాగమణివిక్టర్, వైస్ చైర్మన్ చింతల భాస్కరరావు, సభ్యులతో జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికరాము ప్రమాణస్వీకారం చేయించారు. తదనంతరం గజమాలలతో చైర్మన్ దంపతులను, ఎమ్మెల్యే కొడాలి నానిలను అభిమానులు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, గూడపాటి వెంకటేశ్వరరావు, గుడివాడ, నందివాడ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు గద్దే పుష్పరాణి, పెయ్యల ఆదాం, గోళ్ల రామకృష్ణ, కందుల దుర్గాకుమారి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ పాల్గొన్నారు.

**ప్రమాణస్వీకారం చేసిన పాలకవర్గ సభ్యులు**

చైర్మన్‌గా మట్టా నాగమణివిక్టర్, వైస్ చైర్మన్‌గా చింతల భాస్కరరావు, సభ్యులుగా ఆకునూరి మేరీగ్రేస్, మసిముక్కు శివనాగరాజు, బండి రాంబాబు, షేక్ ఉస్మాన్, చేవూరి కమలకుమారి, చుక్కా నాగలక్ష్మి, అవుటపల్లి నాగలక్ష్మి, ఈడే శివనాగలక్ష్మి, మేరుగ గోపి, అడపా జగదీష్, జిల్లా సుధారాణి, కఠారి శేషుబాబు, చందనపల్లి సుందరరావు, చినలింగాల పీఏసీఎస్ అధ్యక్షుడు బోడి సీతారామరాజు, మార్కెటింగ్ అధికారి, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, బొమ్ములూరు స్పెషల్ ఆఫీసర్లు ప్రమాణస్వీకారం చేశారు.



కొడాలి నానిని గజమాలతో సత్కరిస్తున్న మార్కెట్‌యార్డ్ చైర్మన్ దంపతులు



మార్కెట్‌యార్డ్ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

# ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

**పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్**



కూదేరులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

**పమిడిముక్కల:** ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య రక్షణపై అవగాహన కలిస్తారని, వైద్య సిబ్బంది ఆరోగ్య సర్వే చేస్తారని పేర్కొన్నారు. ప్రాథమిక పరీక్షలతో ఆరోగ్య సమస్యలను గుర్తించడంతో పాటు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా చికిత్సలు, ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. మండలంలోని కూదేరు గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు తొలుత ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేశారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతర్గత రోడ్ల అబివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విఠల్‌పాల్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సర్పంచ్ వీర్ల నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు వీర్ల ఆదిశేషు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, నాయకులు యేసుగ మస్తాన్‌రావు, కొణతం రాధా రమేష్ పాల్గొన్నారు.

# సామూహిక వరలక్ష్మీ వ్రతం

**గుడ్లవల్లేరు:** వడ్లమన్నాడు మహాలక్ష్మీ అమ్మవారి మాను వద్ద శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలను చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు విచ్చేసి వ్రతాల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకర్, నిర్వాహకులు గంధం వీర రాఘవయ్య, పురమా నాగు, పుల్లేటి గంగయ్య, గంధం శివ, కటకం కొండ, గుడిసేవ రాజబాబు పాల్గొన్నారు.

**గుడివాడలో..**

**గుడివాడ టౌన్:** స్థానిక కాకర్ల వీధిలోని వేణుగోపాలస్వామి దేవస్థానం కాలక్షేప మండపంలో శుక్రవారం సామూహిక లక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. శ్రావణమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వై.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ చైర్మన్ దుడ్డు చిన్నా పాల్గొన్నారు.

**దోకిపర్రు మహాక్షేత్రంలో..**

**గుడ్లవల్లేరు:** భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం దోకిపర్రు మహాక్షేత్రంలో పవిత్ర శ్రావణ శుక్రవారం రాత్రి భారీ సంఖ్యలో మహిళా భక్తులతో వరలక్ష్మీ దేవి సామూహిక వ్రతాలను నిర్వహించారు. తొలుత వరలక్ష్మీ దేవికి స్వామివారి దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను చేపట్టారు ఆలయ నిర్వాహకులు పురిటిపాటి విజయలక్ష్మి, కొమ్మారెడ్డి విజయ భాస్కరమ్మ పాల్గొన్నారు.

**ముదినేపల్లి రూరల్ :** ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ అర్చకులు వ్రతం చేశారు. ఆలయ చైర్మన్ కొంతి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణ చేసి భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# మండల సమగ్రాభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే డీఎన్నార్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీపీ, జెడ్పీటీసీ

**కైకలూరు:** ప్రజలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల సమగ్రాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన కైకలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం హాల్లో శుక్రవారం నిర్వహించారు. మండలంలో వివిధ శాఖల పనితీరును అధికారులు వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలో రూ.100 కోట్లు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిందన్నారు. పెదఎడ్లగాడి – నందిగామ లంక రహదారికి రూ.7.80 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో పడిన సర్కారు కాలువపై వారిధి నిర్మాణానికి రూ.14 కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. పనులు పూర్తై రెండు నెలల్లో ప్రారంభానికి సిద్ధం చేసిందని తెలిపారు. వారధి నిర్మాణంలో గత ప్రభుత్వం పాలనలో జరిగిన పెండింగ్ బిల్లులు రూ.5 కోట్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెల్లించిందన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ ఏరియాల్లో పనులకు ప్రాధాన్యం కల్పించామన్నారు. జిల్లాలోనే కైకలూరు నియోజకవర్గం అభివృద్ధి పనుల్లో ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ఎంపీపీ అడవి కృష్ణ మాట్లాడుతూ మండలంలో పంచాయతీ సెక్రటరీల కొరత ఉందన్నారు. దీంతో ఎమ్మెల్యే డీఎన్నార్ సచివాలయ గ్రేడ్–5 సెక్రటరీల సేవలను వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మండల పరిషత్ నుంచి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. మండల అభివృద్ధి పనుల్లో కైకలూరు మండలం ముందు వరుసలో ఉందని తెలిపారు. తహసీల్దారు బి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఓటర్ల చేర్పులు, తొలగింపులను బీఎల్ఓలు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఏఎంసీ చైర్ పర్సన్ దండే పుష్పలత, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలి

**పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్**



**కురుమద్దాలి(పామర్రు):** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని, దీని ద్వారా భక్తి భావం పెంపొంది గ్రామాలు సుభిక్షంగా సస్యశ్యామలంగా ఉంటాయని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధి కురుమద్దాలి గ్రామంలోని కొత్త కురుమద్దాలి యాదవాపురంలో రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు ఐదు సెంట్ల భూమిలో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. టీటీడీ, స్థానిక దాతల సహకారంతో ఆలయ నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నూతక్కి శివరామకృష్ణ, మంగదొడ్డి శ్రీనివాసరావు, ముత్తేవి ప్రసాద్, ఆలయ కన్వీనర్ జొన్నలగడ్డ సురేష్, కొణతం శ్రీనివాసరావు, తలారి సుబ్బారావు, తలారి రాంప్రసాద్ పాల్గొన్నారు.

**నేడు ఎమ్మెల్యే కార్యక్రమాలు**

**పామర్రు:** మండలంలోని ఉరుటూరు, పామర్రు టౌన్‌లోని ఏడో వార్డులో సీసీ రోడ్లను శనివారం ఉదయం 10 గంటలకు పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి మండలంలోని జుఝవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

**నేడు జాతీయ లోక్ అదాలత్**

**కైకలూరు:** స్థానిక కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని సీనియర్ సివిల్ జడ్జి జి.షణ్ముఖరావు తెలిపారు. కక్షిదారులు రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

# సీఏ చేసినవారికి మంచి భవిష్యత్

**గుడివాడ టౌన్:** దేశ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులు సంభవిస్తున్న నేపథ్యంలో చార్టెడ్ అకౌంటెన్స్(సీఏ)కు మంచి భవిష్యత్ ఉంటుందని డీవైఈఓ పద్మారాణి అన్నారు. స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాల ఆడిటోరియంలో పురపాలక సంఘ పాఠశాలలో చదువుచున్న 9, 10 తరగతుల విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఐసీఏఐ విజయవాడ శాఖ ప్రారంభించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు మెగా కెరీర్ కౌన్సెలింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మారాణి మాట్లాడుతూ వ్యాపారాలు, కంపెనీలు దేశంలో అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో చార్టెడ్ అకౌంటెన్స్ అవసరం ఉంటుందన్నారు. ప్రముఖ ఆడిటర్ ఎంఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సీఏ పూర్తి చేసేందుకు కేవలం ఫీజు రూ.80 వేలు అవుతుందన్నారు. తనవద్ద కోర్సుచేసే విద్యార్థులకు తానే ఆ మొత్తాన్ని చెల్లిస్తానన్నారు. వీరిలో పేద విద్యార్థులు ఎవరైనా ఉంటే వారి తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.3 లక్షల లోపు ఉన్న యెడల నెలకు రూ.1,500 చొప్పున అదనంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

# పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు

**గుడ్లవల్లేరు:** పల్లెల్లో జరిగే అభివృద్ధే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు అని భూ సమేత వేంకటేశ్వర దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త పురిటిపాటి సుధారెడ్డి అన్నారు. దోకిపర్రులో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ(సి.ఎస్.ఆర్) కింద ఎంఈఐఎల్, ఎస్.ఆర్ పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆమె చేతుల మీదుగా ప్రారంభించారు. దోకిపర్రు పరిసర ప్రాంతాల్లో యువతను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, ప్రసన్న, విజయ భాస్కరమ్మ, వెంకటలక్ష్మి, హారిణి పాల్గొన్నారు.

# కొండదొరలకు కమిటీతో తగిన న్యాయం

**ముదినేపల్లి రూరల్ :** గురజ కొండదొరలకు కమిటీతో తగిన న్యాయం చేస్తామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ముదినేపల్లి మండలం గురజలో ఉత్తరాంధ్ర నుంచి వలస వచ్చిన కొండదొరల ఎస్టీ ధ్రువీకరణ సమస్యలపై ఏర్పాటుచేసిన కమిటీ శుక్రవారం పర్యటించింది. కొండదొరలతో గురజ వేణుగోపాలస్వామి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పాలనలో కొండదొరలకు న్యాయం జరగలేదన్నారు. దీనిపై తాను ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడడంతో జిల్లా కలెక్టర్ కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూర్యతేజ ఆధ్వర్యంలో ఆర్డీఓ కె.పెంచెల కిషోర్, సోషల్ వెల్ఫేర్ కేడీ జయప్రకాష్, స్థానిక తహసీల్దార్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటుచేశారని చెప్పారు. దీనిని టీడీపీ నాయకులు రాజకీయం చేసి తమ వల్లనే కమిటీ ఏర్పడినట్లు అపోహలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ పాలనలో చేయలేని పని వైఎస్సార్ సీపీ హయాంలో చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం అధికారులు స్థానిక ఎస్టీ కాలనీలో పర్యటించారు. కొండదొరల ఆచార వ్యవహారాలపై సమగ్రంగా వివరాలను సేకరించారు. కుల ధ్రువీకరణ లేకపోవడంతో తమ పిల్లల ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగాల కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు వాపోయారు. తమకు న్యాయం చేయాలని కొండదొరలు కోరారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేసి న్యాయం జరిగేలా కృషి చేస్తామని అధికారులు బదులిచ్చారు. ఈ సందర్భంగా తమ గురించి ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కమిటీ ఏర్పాటు పై కొండదొరలు హర్షం వ్యక్తం చేశారు.

# అంకితభావంతో విధులు నిర్వహించాలి



సత్కారం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

**ముదినేపల్లి రూరల్ :** అంకితభావంతో విధులు నిర్వహించేవారిని ప్రజలు, ప్రభుత్వం ఎల్లప్పుడూ గుర్తిస్తారని ఎంఈఓ–1 కె.నరేష్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఈ నెల 5న సత్కరించాల్సి ఉన్నప్పటికీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. వీరితో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా స్థానిక సహాయ మాత పబ్లిక్ స్కూల్లో ఉత్తమ ఉపాధ్యాయులను శుక్రవారం సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కె.హరిబాబు, వై.కృష్ణకుమారి, వి.సత్యనారాయణ, బి.వెంకటరత్నం, కె.రఘురామయ్య, కె.అరుంధతి, ఎం.వెంకటసుబ్బారావు, డి.గాయత్రి, అలీ అక్బర్, క్లస్టర్ రీసోర్స్ పర్సన్ సీహెచ్ విజయదుర్గలను సత్కరించారు.

## సంక్షిప్త వార్తలు

**కొత్త పింఛన్ల పంపిణీ**

**పమిడిముక్కల:** మండలంలోని తాడంకి గ్రామంలో కొత్త పింఛన్ల పంపిణీ శుక్రవారం చేపట్టారు. లబ్ధిదారులకు ఈ పింఛన్లను సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీలక్ష్మి అందజేశారు.

**34 కొత్త పెన్షన్ల పంపిణీ**

**పామర్రు:** స్థానిక 3, 4, 5 సచివాలయాల పరిధిలో మొత్తం 34 కొత్త పింఛన్లు మంజూరు కాగా వాటిని సచివాలయం–4 వద్ద శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆర్బీకే మండల అధ్యక్షుడు శ్రీనాథ్ రెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక సిగ్మెంట్‌లో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు పింఛన్లను అందజేశారు.

**వాడపల్లికి ప్రత్యేక బస్సు**

**గుడివాడ టౌన్:** వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకునే భక్తులకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ డి.రాజేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ఐదు గంటలకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయలు దేరుతుందని పేర్కొన్నారు.

**ఇంటి తాళం పగలగొట్టి చోరీ**

**పెదపూడి(మొవ్వ):** పట్ట పగలు ఇంటి తాళం పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు 30 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10వేలు చోరీ చేసిన ఘటన మొవ్వ మండలం పెదపూడి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కూచిపూడి పోలీసుల కథనం మేరకు పెదపూడి గ్రామానికి చెందిన బుగ్గ సత్యనారాయణ తన భార్య అనారోగ్యంతో బాధపడుతోందని, శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇంటికి తాళాలు వేసి మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం 1.45 గంటలకు ఇంటికి వచ్చారు. ఆ సమయానికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి, బీరువాలోని 30 గ్రాముల బంగారం, రూ.10వేలతో దుండగులు పరారయ్యారని తెలిపారు. సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూచిపూడి ఎస్సై సందీప్ సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. మచిలీపట్నం క్లూస్ టీం వెరఫికేషన్ చేసి వివరాలు సేకరించారు.

**ఆటల పోటీలకు ఏర్పాట్లు చేయాలి**

**గుడివాడ టౌన్:** గ్రామీణ క్రీడల ప్రోత్సాహంలో భాగంగా ఈ నెల 12, 13 తేదీలలో నిర్వహించనున్న బాలబాలికల ఆటల పోటీలకు ఏర్పాట్లు చేయాలని నందివాడ మండల ఎంఈఓ–2 జి.డేవిడ్‌రాజు కోరారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ 17 సంవత్సరాల లోపు, 13వ తేదీ 14 ఏళ్ల లోపు బాలబాలికలకు ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. నందివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ పోటీలు ఉంటాయని, ప్రతిభను ప్రదర్శించే క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హులవుతారన్నారు.

**ఎంపీ బాలశౌరి నేడు తోట్లవల్లూరు రాక**

**తోట్లవల్లూరు:** మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం తోట్లవల్లూరుకు విచ్చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక కలాసుమాలపల్లిలో రూ.10 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సిమెంటు రహదారిని ఎంపీ బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌తో కలిసి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

**అవార్డు గ్రహీతకు సన్మానం**

**పామర్రు:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ రాజాబాబు నుంచి స్థానిక హితమ్ స్కూల్ ప్రిన్సిపల్ నందిపాటి హేమంత్‌రెడ్డి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలోస్థానిక హితమ్ స్కూల్‌లో ఘంటసాల–ఎన్టీఆర్ స్మారక సంగీత కళాపీఠం వారి ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుడ్ని శుక్రవారం ఘనంగా సన్మానించారు. కళా పీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ, కార్యదర్శి మహాదేవ్ రాజు, క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

**పిన్నమనేనికి ఘన నివాళి**

**గుడివాడ టౌన్(నందివాడ):** ఉమ్మడి కృష్ణాజిల్లా మాజీ చైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావు జయంతి వేడుకలు శుక్రవారం ఆయన స్వగ్రామం నందివాడ మండలం రుద్రపాక గ్రామంలో నిర్వహించారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు గ్రామంలోని పిన్నమనేని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**పామర్తికి ఘన నివాళులు**

**గుడివాడ టౌన్:** ప్రముఖ రంగస్థల నటుడు, జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పామర్తి సుబ్బారావు జయంతి శుక్రవారం జరిగింది. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న కైకాల కళామందిరంలోని పామర్తి విగ్రహానికి అభిమానులు నివాళులర్పించారు.

**అన్నసమారాధన**

**మండవల్లి:** మండవల్లి శ్రీ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా శుక్రవారం రాత్రి భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రారంభించారు.

**ఉత్సాహంగా డిగ్రీ కాలేజీ వార్షికోత్సవం**

**కైకలూరు:** స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ 41వ వార్షికోత్సవం శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ బి.రఘునాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ న్యాయవాది ఉదయ్ శంకర్ మాట్లాడుతూ ఉభయ జిల్లాల్లో న్యాక్ ఏ గ్రేడ్ విత్ 3.13 సాధించడంలో అధ్యాపకులు, విద్యార్థుల కృషి అభినందనీయమన్నారు. న్యాయవాది శరత్ కుమార్, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ నెక్స్‌జన్ అధినేత వి.రమణ కాలేజీ అభివృద్ధికి అందించిన సహకారం చిరస్మరణీయమన్నారు.

**స్వచ్ఛత పక్వాడపై డ్రాయింగ్ పోటీలు**

**కైకలూరు:** స్వచ్ఛత పక్వాడ అంశంపై చిత్రలేఖన పోటీలను భుజబలపట్నం ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించారు. డ్రాయింగ్ మాస్టారు జీఎస్ బాబు పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. మొదటి బహుమతి జి.గోల్డి, రెండో బహుమతి పి.సురేంద్ర బాబు, మూడో బహుమతి జి.సాయి కీర్తన దక్కించుకున్నారు.

**CALL LETTER MISSING**

పరసా అనూష, D/o. సత్యనారాయణ, D.No. 15/96, సాయిబాబా గుడి దగ్గర, విద్యా నగర్, ఏలూరు అను నేను CRP RRBS-XII ఎగ్జామ్‌కు సంబంధించిన కాల్‌లెటర్ (రిజిస్ట్రేషన్ నెం. 2250262159, రోల్ నెం. 1221008861) ను కవర్‌లో ఉంచి ది 6-9-2023న ఏలూరు నుండి జనార్ధనపురం వస్తుండగా మార్గమధ్యలో కవరు జారి పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు.